# అభ్యుదయం

నేను ఇంత గుంటడప్పట్నుంచీ రంగయ్యగారిని ఎరుగుదును. ఇప్పటికీ నాకు బాగా జ్ఞాపకం. ఓరోజు సాయంతం రంగయ్యగారు మాయింటికొచ్చాడు. మానాన్న వసారాలో కూచుని ఎవరితోటో మాట్లాడుతున్నాడు. మా నాన్న–కొత్త గనక రంగయ్యగార్ని పలకరించలేదు. ఇదే కారణంతో రంగయ్యగారూ పలకలేదు. 'గారు' అని ఈ మధ్య అనటమేగానీ, అయిదారేళ్ల క్రిందట అందరూ అతన్ని రంగయ్యనే అనేవాళ్ళు–రంగడనీ, రంగన్ననీ, రంగాయనీ అన్నవాళ్ళూ ఉన్నారు. అది వేరేవిషయం!

అంతా వెళ్ళిపోయారు. రంగయ్య మాత్రం అట్లాగే చేతులు కట్టుకొని నిలబడ్డాడు మా నాన్న పోతూ, పోతూ 'ఏమి' టన్నాడు. రంగయ్య సగందాకా వంగి దణ్ణంపెట్టాడు.

"మాది సత్తెనపల్లి" అన్నాడు రంగయ్య. "గంపెడు సంతు ఉన్నవాణ్ణి. మొన్న మొన్నటిదాకా వ్యాపారం చేసి బ్రతికాను. వ్యాపారంలో నష్టాలొచ్చాయి. కొంపాగోడీ బాకీదార్లకిచ్చి ఊరూరూ తిరుగుతూ ఇక్కడికొచ్చాను. బాబుగారు ధర్మమూర్తులనీ, దయాపరులనీ, మోతుబరులనీ విన్నాను. నన్ను రక్షించండి. నా బిడ్డలకింత ఆధరువు చూపించండి"

"నన్నేంచెయ్యమంటా" వన్నాడు మా నాన్న.

"వ్యాపారం చేసుకొని బ్రతుకుతాను. మా కులమే వ్యాపారకులం. కొట్టుగూడా తమ ఇంటికి దాపుల్లోనే పెడదామనుకుంటున్నాను. తమ వాడకమంతా మన కొట్లోనే వాడు

కోండి. మీరు ఎవరెవరి కివ్వమంటే వారికల్లా అప్పు యిస్తాను." అన్నాడు రంగయ్య.

ఇందులో మా నాన్న చేయవలసిన సాయమేమిటో నాకు తోచలేదు. ఈ మాటే నాయనగారుకూడా అన్నారు.

"అమ్మమ్మా! అలాఅనకండి. తమవంటి గొప్పవారి సాయం లేకపోతే నేను మట్టిగొట్టుకుపోనూ!"

అంతటితో ఆఖరూ!

అనుకొన్నట్లుగానే రంగయ్యగారు కొట్టుపెట్టారు. కొట్టంటే పెద్దకొట్టేమీకాదు ఉప్పు, చింతపండు, మిర్చి, నూనెలు, చిల్లరదినుసులు మసాలాసామాన్లు...ఇట్లాంటివి కొద్దికొద్దిగా ఉండేవి. పట్టుమని వందరూపాయల సరుకుగూడా ఉండేదిగాదు. ఈచిన్నకొట్లో మా క్కావలసిందేమీ దొరికేది కాదు. మేమే మీ కొనేవాళ్ళమూ కాదు. కొనలేదని రంగయ్య ఎప్పుడూ అడగలేదు. మేమేదో విపరీతమైన సాయం చేస్తున్నట్లే మాట్లాడేవాడు.

పల్లెటూళ్లో ఈనాటికీ, డబ్బుమారకంకంటే వస్తువుల మారకం అధికంగా ఉంటుంది. రెండుబస్తాల వడ్లు తీసుకొని, బస్తా పచ్చజొన్నలైనా ఇస్తారు. గింజలు ఇచ్చి చిల్లర వెచ్చం, ఏ కొట్లోనైనా తెచ్చుకోవచ్చు. రంగయ్య ఈపద్ధతే అవలంబించాడు. అతని గల్లాలో డబ్బయితే ఉండేదికాదు గానీ, ఇంటినిండా గింజలుండేవి. మూడుగిద్దల వడ్లకు, గిద్దెడు సెనగపప్పుకే, పన్నెండు తిమ్మెరబిళ్ళలు, ఇరవైనాలుగు నిమ్మ తొనలూ రంగయ్య ఇచ్చేవాడు. గిద్దెడు జొన్నలిస్తే ఒక్క బలపమిస్తాడు. పెన్సిలుకు తవ్వెడు పుచ్చుకునేవాడు.

రెండు నెలలయ్యేసరికి రంగయ్యా ఇంటినిండా గింజలే. వాటిని బళ్ళకెత్తించి బస్తీలో అమ్మేవాడు. వచ్చేప్పుడు ఆ బళ్ళమీదనే, చవక రేట్లకు సరుకులు వేసుకొచ్చేవాడు. దీని వల్ల రంగయ్యా రెండువిధాల లాభించేవాడు. ఒకటి ఊళ్ళో ధాన్యాన్ని చవక రేటులోకొని, ఎక్కువధరకు బస్తీలో అమ్మడం. రెండు సరుకులమీద న్యాయంగా వేసుకోవలసిన లాభాలు.

రంగయ్యాకు ఆరుగురు పిల్లలున్నారు. పెద్దవాడు కొట్లో కూచుంటాడు. పెద్దదీ, రెండోదీ పెళ్ళిళ్ళు చేసుకొని అత్తిళ్ళకెళ్ళారు. మూడోవాడు చదువుకుంటున్నాడు కడమ ఇద్దరూ చిన్నోళ్ళు. అయినా రంగయ్యా భార్య ఇంటినే అట్టిపెట్టుకొని ఉండలేదు. పకోడీలు, కారప్పూస, పప్పుచెక్క పల్లికలో వేసుకుని ఊరంతా తిరిగి అమ్మేది. పనిలోపనిగా, ఎక్కడ పేడ చిదప కనిపించినా పట్టుకొచ్చేది.

ఆవిడపరంగా పది ఖాతాలున్నాయి. అధమపక్షం నెల పక్కింటికి ఆపది ఖాతాలు పదిపదులు- నూరు చెల్లించేవి.

రెండోవాణ్ణి చదువు మానిపించాడు రంగయ్యా. ఇదేమిటని ఎవరైనా అడిగితే :-

"ఆఁ...మీబోటి మారాజులగ్గానీ...చచ్చుల్లిపాయలమ్ముకునే మాకెందుకండీ చదువూ? ఉద్యోగాలు చేస్తామా, ఊళ్ళేలతామా?" అనేవాడు రంగయ్యా.

ఇప్పుడు ఊళ్ళో పెద్దవారిఖాతాలన్నీ రంగయ్యాగారు సంపాదించాడు. ఆ యిళ్ళవాళ్ళు కొట్టుకొచ్చి సరుకులు పట్టుకెళ్ళనవసరంలేదు. రంగయ్యాగారే స్వయంగా పట్టుకెళ్ళి

ఇచ్చేవాడు. ఎవరెవరికి ఏమేమి కావలసిందీ, ఎప్పుడుకావలసిందీ నిత్యమూ కనుక్కొంటుండడమూ, అవి సప్లయిచేయుటమూ అతనిడ్యూటీ! ఇటీవల రంగయ్యగారు బస్తీకెళ్ళడం మానుకొన్నాడు. పెద్దవాడే అవన్నీ చూస్తున్నాడు. చిన్నవాడు కొట్లోకూచుంటున్నాడు. అద్దెకొంపేలవుగాక, కాస్తంత పెద్దది చేసుకొన్నాడు. వ్యాపారాన్ని పెద్దదిచేశాడు.

ఈనాడు ధాన్యం అమ్మడానికి మాపూళ్ళో ఎవ్వరూ బస్తీ కెళ్ళడంలేదు. ఎందుకు? బస్తీధరమీద రూపాయకు బేడలుతగ్గించి రంగయ్యగారేకొంటారు. బస్తీకెళ్ళినా ఖర్చులు మట్టీ-మశానమూ కలిసి ఆ ధరే గిట్టుబాటవుతుంది. అయినా వెళ్ళంగానే డబ్బుచేతిలోపడ దక్కడ. రంగయ్యగారదేమీ లేదు. ధాన్యంకొలత కాగానే, డబ్బు ముద్దరపద్దిగా ముట్ట చెబుతాడు. అతని తూనిక పెద్దదని కిట్టనివాళ్ళు అంటారు గానీ, అది నిజంకాదు.

ఇంతలో యుద్ధంవచ్చింది. సరుకులకు విపరీతంగా ధరలు పెరిగాయి. మార్కెట్లో డబ్బున్నది. సరుకులే లేవు. అయినా తన ఖాతాదార్లకు ఏ సరుకూ లేదనకుండా సప్లయిచేశాడు రంగయ్య. ఎక్కడా కిరసనాలు లేనిరోజున పాతికడబ్బాలు కావాలంటే తెప్పిస్తాడు. మందులోకి పంచదార దొరక్క పోయిందా — రంగయ్యనడిగితే, ఆరుబస్తాలు తెచ్చిస్తాడు. కాకపోతే, కంట్రోలు రేట్లకు నాలుగురెట్లు, ఐదురెట్లు ఎక్కువ పుచ్చుకొనేవాడు. అయినా, అతనిదేం తప్పుంది? అసలు బస్తీలోనే రేట్లు మండిపోతుంటే రంగయ్యేంచేస్తాడు పాపం!

రంగయ్యభార్య కూడా ఈ విషయంలో భర్తకు

యథాశక్తి తోడుపడుతుండేది. లాంగ్‌క్లాత్ తాన్లు, గ్లాస్కో పంచలు, తట్టల్లో పెట్టుకుని, ఇంటింటికీ తిరిగి అమ్మేది.

రంగయ్యగారికి రాజకీయాలంటూ లేవు. అన్ని పార్టీలు అతనికి అభిమానమైనవే! కానయితే, కమ్యూనిస్టులంటే మాత్రం రవంత కంటుగా ఉండేది. అయితే అదెక్కడా బైట పడనిచ్చేవాడు గాదు. అదయినా ఎందుకొచ్చిందీ? దొంగ వ్యాపారం చేస్తుంటే పోలీసులకు వాళ్ళుపట్టిచ్చారని. పోలీసులు బుద్ధిమంతులుగనక, పరువు మర్యాదలు ఆలోచించే వారుగనక, పాతిక్కో పరక్కో పుచ్చుకొని కేసును తొక్కి పారేశారు. లేకపోతే రంగయ్య ఎంత హైరానాపడవలసివచ్చేదీ! అందుకుతోడు వూళ్ళో పెద్దలుగూడా అతనికి అండగా నిలబడ్డారు. గండంగడచి పిండంబైటబడ్డది.

రంగయ్యగారు ఏపార్టీఅయిందీ 1947 ఆగస్టుదాకా స్పష్టంగా తెలీదు. తొలిసారిగా ఆయనఇంటిమీద కాంగ్రెసు జండా ఎగరడం నా కంత ఆశ్చర్యం కలిగించలేదు. ఎప్పుడో ఒకప్పుడు ఇలాంటి ఘనకార్యం రంగయ్యగారు చేస్తారని, నేను చాలాకాలంక్రిందటే ఊహించాను. చాలా విషయాల్లోలాగే, ఈవిషయంలోగూడా నా అంచనా తప్పలేదు. అందరితోబాటు ఆయనగూడా జండాబట్టుకొని తిరిగాడు. జేజేలు కొట్టాడు. తనవాళ్ళచేత జేజేలు కొట్టించుకొన్నాడు. ఆనాడు ఎగరేసిన జాతీయపతాకం, ఈనాటికీ రంగయ్యగారింటిని అలంకరిస్తూనే ఉన్నది.

స్వాతంత్ర్యం వచ్చినతరువాత, మావూరు చాలామంది నాయకులు రావటం సాగించారు. ఇదివరకు మా

యింట్లో మకాం వేస్తుండేవారు. ఇపుడు రంగయ్యగారే, వారికి ఆతిథ్యమివ్వసాగారు. కాంగ్రెసునిధికి ఆయన భూరి విరాళ మివ్వటమే గాకుండా, పదిమందిచేత ఇప్పించాడుగూడాను. రాష్ట్రంలో మనప్రభుత్వాలు ఏర్పడినతరువాత, రెండు బస్సు రూట్లు సంపాదించాడు. ఆయనకూ, ఇంకో ఎమ్. ఎల్. ఏ. గారికీ అందులో వాటాలున్నాయని ఊరంతా అనుకొన్నారు. రంగయ్యగారు, దాన్ని పూర్తిగా వ్యతిరేకించాడు. ఎవరో గిట్టనివారు పుట్టించిన పుకారన్నాడు. రంగయ్యలాంటి దేశభక్తునిమాట విశ్వసించకపోవడమా? ఎంతతప్పు!

అయితే ఆయనకొంపలోనే ముసలంబుట్టింది. మొన్నటి ఎన్నికల్లో రంగయ్యగారి పెద్దకొడుకు, కమ్యూనిస్టుల తరఫున పనిచేశాడు. ఆయనగారింటిమీద కమ్యూనిస్టుజండా ఎగిరింది. ఎవరన్నా అడిగితే, రంగయ్యగారు, నవ్వి వూరుకొనేవాడు.

"బాబూ! ఈకాలపు కుర్రకారుకు సమాధానం చెప్పలేం! వాడిపిచ్చి వాడిదీ!" అన్నాడు రంగయ్యగారు.

రంగయ్యగారు కాంగ్రెసుతరఫున ప్రచారంచేస్తే, కొడుకు కమ్యూనిస్టుల పక్షాన పనిచేశాడు. ఎన్నికల్లో కమ్యూనిస్టులు "మట్టికొట్టుకు" పోయారు. రంగయ్య ఇంటిమీద ఎర్ర జండా తిరిగి కనపడ్లేదు. ఒకరోజుదినపత్రికలో రంగయ్య పెద్ద కొడుకు సుదీర్ఘమైన ప్రకటనచేశాడు. అందులో తననుకమ్యూనిస్టులు ఎట్లా మోసగించిందీ వైనవైనాలుగా వర్ణించాడు.

"కొడుకు ఆముదనష్టపువాళ్ళతో కలిసి "చెడి"పోయ్యాడనుకొన్నాను. కాదు. బాగుపడ్డాడు. నాక్కావలసిందిగూడా అదే" అన్నాడు రంగయ్య.